సాక్షి
నంద్యాల
సోమవారం । 12 । ఆగస్టు । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎ.నాగేశ్వరరావు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



నొప్పి నివారణకు దారేదీ?

నొప్పులతో బాధపడుతున్న వారికి ఉపశమనం అందించేందుకు బోధనాసుపత్రుల్లో పెయిన్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు పెద్దాసుపత్రిలో మాత్రం దీనిని ఏర్పాటు చేయలేదు. 8లో▸

న్యూస్‌రీల్

కారణం లేకుండా రాత్రిళ్లు బయటకు రావొద్దు



జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

బొమ్మలసత్రం: ఎటువంటి కారణం లేకుండా ఎవరైనా అర్ధరాత్రి వేళ రహదారులపై తిరిగితే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా హెచ్చరించారు. రాత్రిళ్లు నిర్వహించే పోలీస్ గస్తీ ఇక నుంచి కఠినంగా ఉంటుందని ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాత్రి వేళ బయటకు వచ్చే వారి వాహనం రికార్డులు తప్పక పరిశీలిస్తారని, అనుమానితులుగా అనిపిస్తే వారి వేలి ముద్రలు సేకరిస్తారని వివరించారు. ప్రార్థన మందిరాలు, ఏటీఎంలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద నిరంతర గస్తీ ఉంటుందన్నారు. జాతీయ రహదారులపై వాహనాల తనిఖీ, డ్రైవర్లకు నిద్రమత్తు లేకుండా స్టాప్ అండ్ వాష్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డార్మెటరీ, లాడ్జిల్లో ఇకపై ప్రతి రోజు తనిఖీలు ఉంటాయన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లలో కొత్త వారు కనిపిస్తే అనుమానాస్పదంతో విచారించి వివరాలు సేకరిస్తామన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): స్థానిక కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

రైతులు ఈ - పంట నమోదు చేసుకోవాలి

- సెప్టెంబర్ 15 వరకు తుది గడువు

నంద్యాల(అర్బన్): జిల్లా రైతులు ఈ పంట నమోదును తప్పని సరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-పంట నమోదు చేయించుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకోవాలంటే తప్పనిసరిగా సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. గతేడాది నుంచే జియో ఫెన్సింగ్ విధానం అమలు చేస్తుండగా, కొత్తగా ఫేషియల్ రికగ్నిషన్, ఈ ఫిష్ డేటా అప్రూవల్, అబ్జక్షన్‌బుల్ లాండ్స్‌లో వేసే పంట నమోదును ఈ-పంటలో చేర్చడాన్ని సులభతరం చేశామన్నారు. ఈ విధానంలో రైతుకు, కౌలు రైతుకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఈ-పంట నమోదు కార్యక్రమం సెప్టెంబర్ 15వ తేదీతో ముగుస్తున్నందున రైతులు త్వరపడాలన్నారు. రైతుసేవ కేంద్రాల ద్వారా సిబ్బంది ఈ-పంట నమోదు చేస్తారని, దీని ఆధారంగానే రైతులకు లభించే ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. పంట నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'పచ్చ'ని పేకాట!



''రండి బాబూ రండి! కడప, అనంతపురం, గిద్దలూరు, మహబూబ్‌నగర్, గద్వాల, కర్ణాటక, తెలంగాణ.. ఊరు ఏదైనా పర్వాలేదు. మాఊరికి రండి! హాయిగా పేకాట ఆడుకోండి. మస్తుగా ఎంజాయ్ చేయండి. పేకాట ఆడేందుకు ఇక మీరు రాయచూరు, బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పని లేదు. ఎందుకంటే మా ప్రభుత్వం వచ్చింది! పేకాటకు ఎలాంటి ఇబ్బందీ లేదు. మీకు అన్ని మర్యాదలు చేస్తాం!'' అంటూ పేకాటరాయుళ్లకు నిర్వాహకులు స్వాగతం పలుకుతున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో పేకాట శిబిరాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నేతలతో పాటు అనుచరవర్గం దీన్నే ఆదాయ మార్గంగా ఎంచుకోగా.. కొందరు పోలీసులు సైతం ఈ బాటలోనే పయనిస్తుండటం గమనార్హం.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు

ఉమ్మడి జిల్లాలో జోరుగా పేకాట

- బనగానపల్లె, ఆళ్లగడ్డ, కర్నూలు, ఆలూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో అధికం
- తక్కిన నియోజకవర్గాల్లోనూ విచ్చలవిడిగా శిబిరాలు
- రూ.50వేలు, రూ.లక్ష, రూ.2లక్షల లాంటి హైస్టేక్ గేమ్‌లు
- రూ.10వేలు–30వేల స్మాల్‌స్టేక్‌లు కూడా ఎక్కువే..
- ఇతర జిల్లాల నుంచి వస్తే విమాన టిక్కెట్ సదుపాయం
- ప్రజాప్రతినిధులతో పాటు పోలీసులకూ నెల మామూళ్లు
- త్వరలోనే రిక్రియేషన్ క్లబ్‌లలోనూ పేకాటకు అనుమతి

ఇసుక.. గ్రావెల్.. మట్టి.. సహజ వనరులతో పాటు ఆదాయం ఉన్న ఏ మార్గాన్నీ టీడీపీ నేతలు వదలని పరిస్థితి. ఇప్పుడు అత్యంత సులువుగా, భారీగా ఆదాయం తెచ్చిపెట్టే 'పేకాట'పైనే అందరి దృష్టి పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్థానిక ఎమ్మెల్యేల ఆశీస్సులు, కొందరు పోలీసుల సహకారంతో గత కొద్ది రోజులుగా పేకాట జోరుగా సాగుతోంది. ఇద్దరు మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలు, పోలీసులకు నెలవారీ మామూళ్లు నిర్ణయించి పేకాటను నడుపుతున్నట్లు తెలుస్తోంది. పేకాట ఎక్కడ ఆడుతున్నారు? ఎవరు ఆడిస్తున్నారు? అనే విషయాలు పోలీసులకు స్పష్టంగా తెలుసు. అయితే ర్యాంకును బట్టి వీరికి వాటాలు నిర్ణయించి నెల మామూళ్లు ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఈ ఆదాయాన్ని చూసి కొందరు పోలీసులు పట్టుబట్టి 'పేకాట' పరిధిలోని స్టేషన్లకు వచ్చేందుకు యత్నిస్తున్నారనే చర్చ కూడా ఉంది. ప్రజాప్రతినిధులే స్వయంగా మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేసుకోండని అనుచరులను ప్రోత్సహిస్తుండటం చూస్తే ఇందులో ఎంతటి ఆదాయం ఉందో ఇట్టే అర్థమవుతుంది.

పేకాట ద్వారా నిర్వాహకులకు ఆదాయం

పేకాటబ్యాంకు	నిర్వాహకుడి రోజు ఆదాయం	నెల ఆదాయం
రూ.50 వేలు	రూ.1.60లక్షలు	రూ.48లక్షలు
రూ.లక్ష	రూ.2.40లక్షలు	రూ.72లక్షలు
రూ.2లక్షలు	రూ.40లక్షలు	రూ.7కోట్లు

(రోజుకు 50 గేమ్‌ల చొప్పున)



పేకాటరాయుళ్లకు కల్పించే సదుపాయాలు..

శిబిరం నిర్వాహకుడికి పాయింట్లు ఇచ్చినందుకు పేకాట ఆడేందుకు సూదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి గదులు, రవాణా, కోరిన ఆహారం ఏర్పాటు చేస్తారు. రూ.2లక్షల బ్యాంకు ఆడేవారికి డబుల్‌బ్లాక్, గ్లెన్‌లివెట్ లాంటి విదేశీ మందు ఇస్తారు. సుదూరప్రాంతాల నుంచి వచ్చే వారికి విమానటిక్కెట్‌లు బుక్ చేస్తారు. ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువ మందిని పేకాటకు తీసుకొచ్చే వారికి నెలకు రూ.లక్ష–2లక్షలు గిఫ్ట్‌గా చెల్లిస్తున్నారు.

త్వరలో క్లబ్‌లలో కూడా ఆడిస్తారట!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని రకాల రిక్రియేషన్ క్లబ్‌లలో పేకాట నిషేధించారు. జూదానికి బానిసలై జీవితాలు నాశనం అవుతాయని అప్పటి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. అయితే ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రావడంతో పేకాటరాయుళ్ల 'అన్నా! పేకాట ఆడుకుంటాం. ఊరికే వచ్చే ఆదాయం. మన కార్యకర్తలు బాగుపడతారు. మీకూ కొంత డబ్బు వస్తుంది.' అని లెక్కలు వేశారు. ఇంకెందుకు ఆలస్యం అన్నట్లు ఎమ్మెల్యేలు కూడా ఆటకు 'గ్రీన్‌సిగ్నల్' ఇచ్చి పోలీసులకు జాగ్రత్తలు చెప్పారు. వారిని కూడా చూసుకోండని అనుచరులకు సలహా ఇచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పేకాట జోరందుకుంది. త్వరలో కొన్ని రిక్రియేషన్ క్లబ్‌లలో కూడా ఆడించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

విశ్వసనీయ సమాచారం మేరకు నెల మామూళ్లు ఇలా..

వ్యక్తి	నెలమామూళ్లు (రూ.లక్షల్లో)
నియోజకవర్గ ప్రజాప్రతినిధి	10
పేకాట శిబిరం నియోజకవర్గ కేంద్రంలో మంత్రి అనుమతి ఇస్తే..	25
పోలీసు స్టేషన్ సిబ్బందికి	2
ఆపై అధికారికి	3
ఆపై అధికారికి	5
ఆపై అధికారికి	10

ఈ ప్రాంతాల్లో జోరుగా పేకాట

♣ బనగానపల్లె నియోజకవర్గం ఇస్రేనాయక్ తండా పరిధిలోని కంబగిరి స్వామి సమీపంలోని ఎర్రమలలో పేకాట నడుస్తోంది. ఇక్కడ 'హైస్టేక్స్' ఆడతారు. రూ.లక్ష, రూ.2లక్షల బ్యాంకులు ఆడతారు. ఇక్కడి నుంచి నంద్యాలలోని ఓ జిల్లా పోలీసు అధికారికి రోజూ రూ.2లక్షలు పంపేవారు. ఇటీవల ఆయన బదిలీ అయ్యారు. అయినా పేకాట ఆగలేదు. ఇక్కడికి ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప, పులివెందులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా ఆటగాళ్లు వస్తున్నారు.

♦ గద్వాలకు చెందిన ఓ వ్యక్తి తెలంగాణలో పేకాట ఆడించేవాడు. అక్కడికి కర్నూలు వారు వెళ్లేవారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రావడంతో తెలంగాణ వాసి ఇక్కడే పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు.

♥ ఆలూరు నియోజకవర్గం అగ్రహారం, హత్తి బెళగల్, కల్లెవంక పరిధిలో రోజుకో చోట పేకాట ఆడిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో పేకాట యథేచ్ఛగా ఆడించిన ఓ ప్రజాప్రతినిధి 6గురు అనుచరులే తాజాగా నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు.

♠ కర్నూలు సిటీలోని వెంకటరమణ కాలనీలో పేకాట నడుస్తోంది.

♣ జొహరాపురంలోని ఓ ఇంట్లో పేకాట ఆడిస్తున్నారు.

♦ పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ వెనుక వైపున్న విల్లాలలో ఓ ఇల్లు పేకాట కేంద్రంగా ఉంది.


♥ కర్నూలు–నంద్యాల ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని కొండకు దగ్గరగా ఉన్న ఓ వెంచర్‌లో పేకాట నడుస్తోంది.

♠ మహానంది మండలం గాజులపల్లె సమీపంలోని బసాపురంలోనూ పేకాట సాగుతోంది.

♦ నంద్యాల పరిధిలోని పులిమద్ది, ఆత్మకూరు ఫారెస్టులో పేకాట ఆడిస్తున్నారు.

♣ ఆదోనిలో హైస్టేక్ ఆడిస్తున్నారు. బళ్లారి, కర్ణాటక జూదరులు ఎక్కువగా వస్తున్నారు.

ఆదాయం చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే..



పేకాటను స్మాల్ స్టేక్(చిన్నబ్యాంకులు), హైస్టేక్(పెద్దబ్యాంకులు) రెండు రకాలుగా నిర్వహిస్తారు. స్మాల్‌స్టేక్‌లో రూ.10వేల నుంచి రూ.30వేల వరకూ ఆడతారు. హైస్టేక్‌లో రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2లక్షలు మూడు రకాల బ్యాంకులు ఆడతారు.

♥ స్టేక్(బ్యాంకు) ఏదైనా ఒక్కో బ్యాంకుకు 250 పాయింట్లు ఇస్తారు. పేకాట నిర్వాహకుడు డబ్బులు ఇస్తే వారికి 250 పాయింట్ల లెక్కన కాయిన్లు ఇస్తారు. పేకాట శిబిరం వద్ద డబ్బు కట్టలు ఉండవు. శిబిరానికి వచ్చే ముందు నిర్వాహకుడు చెప్పిన ఒక కారు వద్దకు వెళ్లి డబ్బులు ఇస్తే ఆ మొత్తానికి సరిపడా కాయిన్లు ఇస్తారు. అయితే స్టేక్‌ను బట్టి పాయింట్ల విలువ మారుతుంది. ఒక్కో పాయింట్ విలువ రూ.50వేల బ్యాంకు అయితే రూ.200, రూ.లక్షకు రూ.400, రూ. 2లక్షలకు రూ.800గా నిర్ణయిస్తారు. ఊరు, శిబిరం ఎక్కడైనా పాయింట్ల రేటు మాత్రం ఇలాగే ఉంటుంది.

♣ ఒక్కో గేమ్ 10మంది ఆడతారు. కొన్ని సందర్భాల్లో 7గురు ఉంటారు. ఒక గేమ్ పూర్తయితే గెలిచిన వ్యక్తి ఖర్చుల కింద నిర్వాహకుడికి కొన్ని పాయింట్లు ఇవ్వాలి.

♦ రూ.50వేల బ్యాంకు ఆడేవారు 8 పాయింట్లు, రూ.లక్ష బ్యాంకు ఆడితే 6, రూ.2లక్షలు ఆడితే 5 పాయింట్లు ఇవ్వాలి. ఈ లెక్కన రూ.50వేల బ్యాంకు ఒక ఆటకు నిర్వాహకుడికి రూ. 1,600, రూ.లక్ష బ్యాంకు ఆటకు రూ.2,400, హైస్టేక్ అయిన రూ. 2లక్షల బ్యాంకు ఆటకు రూ.8వేల చొప్పున రూ.40వేలు వస్తుంది.

♠ ఒక శిబిరంలో రోజూ కనీసం వంద ఆటలు జరుగుతాయి. ఈ లెక్కన రూ.50వేలు బ్యాంకు రోజుకు రూ.1.60లక్షలు, రూ.లక్ష బ్యాంకునకు రూ.2.40లక్షలు, రూ.2లక్షల స్టేక్‌కు రోజుకు రూ.40లక్షలు నిర్వాహకుడికి వస్తుంది.

♦ రూ.50వేలు, రూ.లక్ష బ్యాంకులు ఎక్కువగా ఆడతారు. వీరు రోజులో వంద గేమ్‌లు కచ్చితంగా ఆడతారు. రూ.2లక్షల బ్యాంకు మాత్రం ఆర్థికంగా బలమైన వారు, ప్రజాప్రతినిధులు మాత్రమే ఉంటారు. ఇవి సగటున రోజుకు 50 గేమ్‌లు జరుగుతాయని తెలుస్తోంది.

వైభవంగా స్వాతి మహోత్సవం

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలు ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. నరసింహస్వామి అవతార దినమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి జయంతి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దిగువ అహోబిలంలో కొలువైన శ్రీ ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు తెల్లవారుజామున విశ్వరూప సేవ, నిత్య పూజల అనంతరం మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను యాగశాలకు చేర్చి, నూతన పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీ సుదర్శన, ధన్వంతరి హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో నవనారసింహ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదస్వామి



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అయిననూ.. ఇచ్చుకోవాల్సిందే!

- జిల్లాలో సచివాలయ సిబ్బంది నుంచి అధికారుల వసూళ్లు
- ఇంక్రిమెంట్ ఫైల్‌పై సంతకానికి డిమాండ్
- వసూళ్లకు ఒక్కో శాఖ తరుపున మండలానికి ఒక ఏజెంట్



ఆళ్లగడ్డ: కొందరు ప్రభుత్వ ఉద్యోగులకు జీతంతో పాటు గీతం లేకపోతే మనసొప్పదు. ప్రజల నుంచి దోచుకోవడం ఓ ఎత్తైతే తమ తోటి సహచర చిరుద్యోగులైన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు సంబంధించిన ఫైల్‌ను ముందుకు కదలించేందుకు ఓ రేటు నిర్ణయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాము పనిచేస్తున్న కార్యాలయంలోనే అధికారుల చెయ్యి తడపనిదే ఆమోదముద్ర పడటం లేదని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల ఇంక్రిమెంట్ ప్రొసీడింగ్స్ వసూళ్ల దందా కలకలం రేపుతోంది. ప్రొబేషన్ పీరియడ్ పూర్తి చేసుకోవడంతో 2023 ఏప్రిల్‌లో అందరిని రెగ్యులర్ చేస్తూ పేస్కేలు వర్తింపజేసింది. సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు వారివారి శాఖల పరిధిలోకి వస్తారు. వీరికి ఉద్యోగ రీత్యా అవసరమైన అన్ని రకాల ఫైళ్లు వారే పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే వీరిపై ఎటువంటి అలిగేషన్‌లు లేవని స్థానిక ఎంపీడీఓలు సంతకం చేసి ఇవ్వాల్సి ఉంది. ఇదే అదునుగా సచివాలయ ఉద్యోగులకు కొందరు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడాదికి ఒక ఇంక్రిమెంట్ ఇస్తూ వేతనంతో కలిపి ఇవ్వాలి. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో 489 గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సుమారు 5 వేల మంది ఉద్యోగులకు జూలై నెల వేతనంతో పాటు అదనంగా రూ. 660 ఇంక్రిమెంట్ డబ్బులు రావాల్సి ఉంది. అయితే ఆ ఇంక్రిమెంట్ ప్రొసీడింగ్స్ పొందేందుకు వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఈ ఇంక్రిమెంట్ ఫైలు కదలాలంటే ముందుగా అడిగినకాడికి ఇవ్వాలని ఆయా శాఖల జిల్లా కార్యాలయాల అధికారులతో పాటు స్థానిక మండలాల అధికారులు వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఎవరికీ అనుమానం రాకుండా పక్కా ప్రణాళికతో వసూళ్లకు పాల్పడుతున్నారు.

రూ. 660 ఇంక్రిమెంట్‌కు రూ.1,500 లంచం

జిల్లాలోని 28 మండలాలు, 5 మున్సిపాలిటీల పరిధిలోని 489 వార్డు, గ్రామ సచివాలయాల్లో 5 వేలకు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో తమతమ శాఖల పర్యవేక్షణ అధికారులకు రూ వెయ్యి, స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారికి రూ. 500 చొప్పున ఇవ్వాలని ఒక్కొక్కరి నుంచి రూ. 1,500 వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇంక్రిమెంట్ కింద రూ. 660 వస్తే రూ. 1,500 తీసుకోవడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు ఆయా శాఖలకు సంబంధించి ఒక్కో మండలానికి ఒక ఏజెంట్‌గా ఎంపిక చేసుకున్నారు. వారు ఆ మండలంలోని తమ శాఖల ఉద్యోగుల నుంచి రూ. వెయ్యి చొప్పున వసూలు చేసుకుని జిల్లా అధికారులకు అందజేస్తున్నారు. మండల కేంద్రంలో ఓ అధికారికి ఇవ్వాల్సిన మొత్తం సచివాలయాల పరిధిలో ఒక ఏజెంట్‌ను ఎంపిక చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు.

ఫారిన్ బాటిల్ ఇచ్చినా..

ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో ఓ అధికారి త్వరలో బదిలీ అవుతున్నారని తెలుసుకుని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు అందరూ వెళ్లి కనీసం బదిలీ అయి పోయే సమయంలోనైనా ఇంక్రిమెంట్ ప్రొసీడింగ్స్‌పై సంతకం పెట్టాలని ప్రాధేయపడ్డారు. ఆయన సరే అనడంతో అందరూ కలిసి ఓ ఫారిన్ మద్యం బాటిల్ తీసుకు పోయి ముందుంచారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ అధికారి 'ఎలా కనపడుతున్నా.. ఉత్త ఈ సీసాకే సంతకం పెట్టాలా..? అని చిందులేయడంతో చేసేది లేక మండలంలోని ఓ సెక్రటరీ ఒక్కొక్కరికి అయిదు వందల చొప్పున లెక్కవేసి అందరిది అతనే ఇచ్చి తరువాత వసూలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇతనొక్కడే కాదు జిల్లా వ్యాప్తంగా చాలా మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

రాజకీయం చేసి.. పేదల ఉపాధి కూల్చి

- మెకానిక్‌ల షెడ్లు దౌర్జన్యంగా తొలగింపు
- అడ్డుకున్న సీపీఎం నాయకులపై చిందులేసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి



భూమి పూజను అడ్డుకున్న సీపీఎం నాయకులు, బాధితులను బెదిరిస్తున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి

నందికొట్కూరు: రెక్కల కష్టాన్ని నమ్ముకుని బతుకీడిస్తున్న పేదల ఉపాధిపై రాజకీయ పిడుగు పడింది. ఓ వైపు సమస్యను సామరస్యంగా పరిష్కరించి ప్రత్యామ్నాయం చూపించాల్సిన అధికారుల అలసత్వంగా వ్యవహరించడం, మరో వైపు అందరినీ సమానంగా చూడాల్సిన పాలకులు వివక్ష చూపడంతో కొందరు పేదలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. పట్టణంలోని సీఎస్ఐ సమాధుల కాంపౌండ్ వాల్ పక్కనే ఉన్న మున్సిపాల్టీ స్థలం వివాదం తారా స్థాయికి చేరుకుంది. దాదాపు 20 ఏళ్లుగా ఈ స్థలంలో కొందరు మెకానిక్‌లు షెడ్లు వేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఆ పక్కనే పాండురంగ స్వామి ఆలయం కూడా ఉంది. అయితే ఈ స్థలం ఆలయానికి సంబంధించిందని, ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని కొన్నేళ్లు ఆలయ కమిటీ సభ్యులు మెకానిక్‌లపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తండ్రి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అండతో ఆ స్థలంలో పాండురంగస్వామి ఆలయం అభివృద్ధి కోసం దుకాణాలు నిర్మించాలని ఆలయ కమిటీ సభ్యులు యత్నించారు. ఈ మేరకు మెకానికుల షెడ్లను దౌర్జన్యంగా తొలగించి దుకాణాల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజశేఖరరెడ్డిని సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. పాండురంగస్వామి ఆలయం పేరుతో ప్రభుత్వ స్థలం ఎలా కబ్జా చేస్తారని సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, రాజు, నాగన్న, బాబు తదితరులు ప్రశ్నించారు. ప్రభుత్వ ఖాళీ స్థలంలో చిన్న, చిన్న షెడ్లు వేసుకుని జీవనం సాగిస్తున్న మెకానికుల షెడ్లను దౌర్జన్యంగా తొలగించడం తగదని, న్యాయం చేయాలని సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేస్తుండగా.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ వారిపై బైరెడ్డి బెదిరింపులకు పాల్పడ్డారు.

రసీదులు చూపించినా పట్టించుకోలేదు..

మున్సిపాల్టీ స్థలంలో తాము 20 ఏళ్లుగా బంకులు వేసుకుని, పన్ను చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నామని బాధితులు చెబుతున్నారు. పన్నులకు సంబంధించిన రసీదులు వారు చూపించినా బైరెడ్డి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పేదలకు న్యాయం చేయాల్సిన రాజకీయ నాయకులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని సీపీఎం నాయకులు విమర్శించారు. నందికొట్కూరు గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ప్రభుత్వ అనుమతితో పాండు రంగస్వామి ఆలయం నిర్మించారన్నారు. అదే సమయంలో మెకానికులు షెడ్లు ఏర్పాటు చేసుకుని పన్ను చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆ షెడ్లను దౌర్జన్యంగా తొలగించి దుకాణాల నిర్మాణాలకు భూమి పూజ చేయడం ఎంత వరకు న్యాయమని నిలదీశారు. పేదల కడుపు కొట్టి దుకాణాలను ఎలా నిర్మిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు బైరెడ్డి న్యాయం చేయకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



మున్సిపాల్టీకి చెల్లించిన పన్ను రసీదులను చూపిస్తున్న బాధితులు

మీరు ఆక్రమణదారులు.. నాస్తికులు

రోడ్డున పడిన మెకానిక్‌లకు న్యాయం చేయాలని విన్నవించేందుకు వెళ్లిన సీపీఎం నాయకులపై మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నోరుపారేసుకన్నారు. 'మీరు చేసిన దౌర్జన్యాలు, ఆక్రమించిన స్థలాల గురించి చెప్పాలా' అంటూ బెదిరించారు. 'మీరు నాస్తికులు, హిందూ ధర్మాన్ని పాటించరు' అని మండిపడ్డారు. బైరెడ్డి వ్యాఖ్యలతో అక్కడ ఉన్న స్థానికులు నివ్వెరపోయారు. పేదల పక్షాన పోరాటం చేసే సీపీఎం నాయకులు, బాధితులపై బైరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బైరెడ్డే దేవాలయం పేరుతో మెకానికుల షెడ్లు తొలగించి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారంటూ పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

గోరుబోలి భాషను రాజ్యాంగంలో చేర్చాలి

- ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాముునాయక్


సమావేశంలో మాట్లాడుతున్న రాముునాయక్

ఓర్వకల్లు: గోరుబోలి భాషను రాజ్యాంగంలో చేర్చాలని ఎస్టీఎఫ్ ఉమ్మడి జిల్లాల షెడ్యూల్ ట్రైబ్ ఫెడరేషన్ అధ్యక్షులు రాముునాయక్ డిమాండ్ చేశారు. ఓర్వకల్లులో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశంలోని 15 రాష్ట్రాలలో గోరుబోలి భాష వాడుకలో ఉంద న్నారు. రాజ్యాంగంలో ఎనిమిదవ షెడ్యూల్లో ఈ భాషను చేర్చాలని కోరుతున్నట్లు తెలిపారు. అతి తక్కువ మంది మాట్లాడే కొం కిని భాషను రాజ్యాంగంలో చేర్చినప్పుడు, 17 కోట్ల మంది మాట్లాడే గోరుబోలి భాషను ఎం దుకు చేర్చడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హనుమాన్‌నాయక్, లక్ష్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి కొనసాగుతున్న నీటి విడుదల


పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి సరఫరా చేస్తున్న కృష్ణా జలాలు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి 25 వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో శ్రీశైలం డ్యాంలోకి 1,08,971క్యూసె క్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా డ్యాంలో 882.70 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 881.70 అడుగుల నీటిమట్టం నమోదైనట్లు తెలి పారు. పోతిరెడ్డిపాడు ఆరుగేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్బీసీ కాల్వలోకి సర ఫరా చేస్తు న్నారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి జీఎన్ఎస్ఎస్ కాల్వకు 12 వేల క్యూసెక్కులు, తెలుగుగంగ కాల్వకు 9వేల , కేసీ ఎస్కేప్ కాల్వకు 4వేల క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

పెట్రోల్ పోసుకుని.. నిప్పంటించుకుని


- ఆదోనిలో వ్యక్తి బలవన్మరణం


సిద్ధరామప్ప (ఫైల్)

ఆదోని అర్బన్: పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని సిద్ధరామప్ప(54) అనే వ్యక్తి శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన సిద్ధరామప్ప ఆదోని పట్టణంలోని శ్రీ హోమ్స్ కాలనీలో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య లింగమ్మ, ఇద్దరు కుమా రులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నకుమా రుడి పెళ్లి విషయంలో వాగ్వాదం చోటు చేసు కోవడంతో సిద్ధరామప్ప మనస్తాపానికి గుర య్యాడు. కాలనీ పక్కనే ఉన్న వైఎస్సార్ కాల నీలోని పొలంలో పెట్రోల్ పోసుకుని, నిప్పం టించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నొప్పి నివారణకు దారేదీ?

- పెయిన్ క్లినిక్ ప్రారంభమెప్పుడు?
- ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆదరణ
- జీజీహెచ్‌లో ప్రారంభించని అధికారులు
- ఎక్కువ మంది మత్తుమందు వైద్యులున్నా చర్యలు శూన్యం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనెస్తీషియా విభాగం

కర్నూలు(హాస్పిటల్): ప్రస్తుత సమాజంలో అధిక శాతం ప్రజలు ఏదో ఒక నొప్పితో బాధపడు తున్నారు. ఇందులో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారిలో నొప్పులు మరింత అధికం. ఇలాంటి వారికి ఉపశమనం అందించడంలో భాగంగా బోధనాసుప త్రుల్లో పెయిన్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పక్కనే ఉన్న అనంతపురంలోనూ కొంత కాలంగా ఈ సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. కానీ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మాత్రం అధికారులు పెయిన్ క్లినిక్ ఏర్పాటులో మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనెస్తీషియా విభాగంలో మూడు యూనిట్లు ఉన్నాయి. ప్రతి యూనిట్‌కు ఒక్కో ప్రొఫెసర్ చొప్పున ముగ్గురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసి యేట్, 16 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఏడాదికి 15 మంది పీజీలతో కలుపుకుని మూడేళ్లకు మొత్తం 45 మంది పీజీలు ఇక్కడ చదువుకుంటూ వైద్యసేవలందిస్తూ ఉన్నారు. ఈ ఆసుపత్రిలో 12 ఆపరేషన్ల థియేట ర్లతో పాటు ఎంఆర్ఐ, సీటీ స్కాన్, కేథలాబ్ విభా గాలలో అనెస్తీషియా వైద్యుల సేవలు అవసరం అవుతాయి. సాధారణంగా ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యుపీహెచ్‌సీలకు వెళ్లే వారిలో నొప్పుల గురించే ఎక్కువగా చికిత్స కోసం వెళ్తుంటారు. ఈ మేరకు ఆయా ఆసుపత్రుల్లో రోగుల నొప్పుల తీవ్ర తను అనుసరించి వైద్యులు అవసరమైన మందులు ఇచ్చి పంపిస్తుంటారు. ఈ నొప్పులు తగ్గకపోతే ఆర్ ఎంపీలను కలిసి చికిత్స తీసుకుంటూ ఉంటారు. వారు స్టెరాయిడ్, పెయిన్‌కిల్లర్‌లను ఒకేసారి ఇంజె క్షన్ల రూపంలో వేసి చికిత్స చేస్తుంటారు. దీనికితోడు నొప్పి నివారణ మందులు వారు విచ్చలవిడిగా ఇస్తుంటారు. ఈ చికిత్సలతో తాత్కాలికంగా నొప్పి తగ్గుతుందేమో గానీ దీర్ఘకాలంలో కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇలా నొప్పి నివారణ మందులు వాడి కిడ్నీలు చెడిపోయి డయాలసిస్‌కు వచ్చే వారి సంఖ్య ఇటీవల కాలంలో అధికమైంది. కానీ నొప్పు లకు నిపుణులైన వైద్యుల వద్ద చికిత్స తీసుకుంటే ఇలాంటి ఇబ్బందులు ఉండవు. ఈ మేరకు ఇటీవల సిటీల్లో మాదిరిగా కర్నూలులోనూ ప్రైవేటు రంగం లో పెయిన్ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయి.

పెద్దాసుపత్రిలో పెయిన్‌క్లినిక్ ఏర్పాటేది?

దీర్ఘకాలిక నొప్పులకు చికిత్స చేయడానికి పెయిన్ క్లినిక్స్ ఏర్పాటు చేస్తామని కొన్నేళ్లుగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అనెస్తీషియా విభాగం వైద్యులు చెబుతూ ఉన్నారు. ఇక్కడ నుంచి వెళ్లిన వైద్యులు అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పెయిన్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వేలాది మందికి నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తున్నారు. కానీ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సీనియర్, నిపుణులైన వైద్యులున్నా పెయిన్ క్లినిక్ అందుబాటులోకి రావడం లేదు. ఇది అందుబాటులోకి వస్తే దీర్ఘకాల నొప్పులకు ఆధునిక పరికరాలు (ఎక్స్‌రే మిషన్, సీటీ స్కానింగ్ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ మిషన్)ను ఉపయోగించి కుట్లులేని ప్రత్యేకమైన ఇంజె క్షన్లు ద్వారా నొప్పితగ్గిస్తారు. ఇందులో భాగంగా నడుంనొప్పి, మోకాలునొప్పి, మెడనొప్పి, తలనొప్పి, క్యాన్సర్ నొప్పులకు చికిత్స చేసి నొప్పి తగ్గిస్తారు. సా ధారణ కాన్పుల వల్ల కలిగే నొప్పులకు లేబర్ అనెల్జిషి యా పద్ధతితో నొప్పిలేని కాన్పు(పెయిన్‌లెస్ లేబర్) సైతం నిర్వహించే అవకాశం ఉంది. ఇలాంటి సేవలను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు రాలేదు



ఆసుపత్రిలో పెయిన్ క్లినిక్ ఏర్పాటు చేయడానికి సుముఖంగా ఉన్నాం. ఇందుకు సంబంధించి అనెస్తీషియా విభాగం నుంచి ప్రతిపాదనలు రాలేదు. వస్తే ఏర్పాట్లు చేస్తాం.

– డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ఐదుగురు అరెస్టు, మరో 8 మంది పరారీ

ప్యాపిలి: మండల పరిధిలోని గుట్టలపల్లి శివా రులోని కొండ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం ప్యాపిలి పోలీసులు దాడులు నిర్వహించారు. అనంతపురం జిల్లా యాడికి మండ లానికి చెందిన తిరుపతయ్య అనే వ్యక్తి గుట్టలపల్లి శివారులో పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐలు చంద్రమోహన్, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి షేక్ మౌలాలి, దూదేకుల బాబు, కొమ్ము రాము, షేక్ మౌలాలి, మహమ్మద్ రఫీలను అదుపులోకి తీసుకు న్నారు. వారి నుంచి రూ. 89,500 నగదు, 3 మోటర్ బైకులు, 4 సెల్ ఫోన్లు, 25 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపారు. పేకాట ఆడుతున్న మరో 8 మంది పరా రైనట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


మృతి చెందిన రెహనాబి

ఓర్వకల్లు: మండల పరిధిలోని కాల్వ గ్రామంలో ఆదివారం ఓ మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ పెద్ద ఖాజామియ్య భార్య షేక్ రెహనాబి (50) ఇంటి వద్ద ఎరువుల సంచులను శుభ్రం చేసి ఆరబెడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతు రాలి భర్త ఖాజామియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

సమస్యాత్మక కాలనీల్లో కార్డన్ సెర్చ్


రౌడీ షీటర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కర్నూలు: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కర్నూలు పోలీసులు నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక కాలనీలు, ఎన్టీఆర్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ నాగరాజరావు, ఎస్ఐలు మోహ న్‌కిషోర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డితో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు ఆదివారం ఉదయం ఆయా కాలనీలను చుట్టుముట్టి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇం దులో భాగంగా వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన రౌడీ షీటర్ షేక్ చాంద్‌బాషా అలియాస్ దుద్దు (23)ను అదుపులోకి తీసుకొని విచారించారు. అతని వద్ద నుంచి డ్రాగస్ షార్ప్ ఎడ్జ్ నైఫ్‌తో పాటు మూడు బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. క్రైం రికా ర్డుల్లో ఇతనిపై ఇది వరకే నాల్గో పట్టణ పోలీస్ స్టేష న్‌లో మూడు కేసులు ఉన్నాయి. రౌడీ షీటర్ల కదలిక లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే నూతన చట్టాలను అమలు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బాబు ప్రసాద్ హెచ్చరించారు.

యువతిని కాపాడిన పోలీసు పెట్రోలింగ్


ఇంద్రజను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

శ్రీశైలం: పోలీస్ పెట్రోలింగ్ నేరాలు అదుపు చేయడమే కాదు.. ప్రజల ప్రాణాలు కూడా కాపాడు తుందనేందుకు ఈ ఘటనే నిదర్శనం. శ్రీశైలంలో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమవుతున్న యువ తిని గస్తీలో ఉన్న పోలీసులు రక్షించి కుటుంబీ కులకు అప్పగించారు. ఆదివారం తెల్లవా రుజామున పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న వన్ టౌన్ పోలీసులు నాను నాయక్, రాంబాబు నాయక్‌కు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఒంటరిగా ఉన్న యువతి ఆందోళనగా కనిపించడంతో వివరాలు ఆరా తీశారు. తన పేరు ఇంద్రజ అని, తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లోని బాపూజీ నగర్ పాత బోయినప ల్లిలో ఉంటానని, ప్రేమ విఫలమై చనిపోయేందుకు శ్రీశైలం వచ్చినట్లు చెప్పడంతో స్టేషన్‌కు తీసుకె ళ్లారు. సీఐ ప్రసాదర్ రావు యువతికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబీకులకు సమాచారం అందజేశారు. మధ్యాహ్నం శ్రీశైలం చేరుకున్న యువతి బంధువు లకు క్షేమంగా అప్పగించారు. యువతిని కాపాడిన పోలీసులను సీఐ అభినందించారు.

శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో మత్స్యకారుడి గల్లంతు


బండారు శేషన్న(ఫైల్)

పగిడ్యాల: శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు గల్లంతయ్యాడు. నెహ్రూనగర్ గ్రామా నికి చెందిన బండారు శేషన్న(60) చేపల వేటతో కుటుంబాన్ని పోషిస్తు న్నాడు. ఇతనికి భార్య శేషమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కృ ష్ణానదికి భారీగా వరద నీరు రావడం తో శ్రీశైలం వెనుక జలాలు గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ వరకు విస్తరిం చాయి. ఆదివారం ఉదయం సుమారు 7 గంటల ప్రాంతంలో చేపలు పట్టేందుకు శేషన్న బ్యాక్‌వాటర్ లోకి తోక బోటులో వెళ్లాడు. బ్యాక్‌వాటర్‌లో కొంత దూరం వెళ్లిన తర్వాత అలల తాకిడికి పడవ బోల్తా పడింది. మత్స్యకారుడు ప్రాణాలను కాపాడుకునేందుకు కొంత దూరం వరకు ఈత కొడుతూ వచ్చి చివరకు నీట మునిగిపోయినట్లు స్థానికులు వివరించారు. సమాచారం తెలుసుకున్న ముచ్చుమర్రి ఇన్‌చార్జ్ ఎస్ఐ గంగయ్య యాదవ్ ఘటన ప్రదేశానికి సిబ్బందితో చేరుకుని వివ రాలు తెలుసుకున్నారు. బ్యాక్‌వాటర్‌లో ఇంజన్‌బో టులో గాలించారు. కృష్ణా జలాలు ఉధృతంగా ఉండడం వలన మత్స్యకారుడి ఆచూకీ లభ్యం కాలేదు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

- అధ్యక్ష, కార్యదర్శులుగా రవిప్రకాశ్‌రావు, ఎంసీ కాశన్న


ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల నూతన కార్యవర్గ ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవ సాయ ఉద్యోగుల సేవా సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా కర్నూలు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంటుగా విధులు నిర్వహిస్తున్న కే.రవి ప్రకాశ్‌రావు మరోసారి ఎన్నికయ్యారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరం లో నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వ రరావు, సహాయ ఎన్నికల అధికారిగా కృష్ణా జిల్లా అధ్యక్షుడు వెన్నా రమేష్, పరిశీలకుడిగా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డీఎస్ఎన్ శ్రీనివాస్‌ల వ్యవహ రించారు. ఉమ్మడి అసోసియేట్ ప్రెసిడెంటుగా పి.ర మేష్‌బాబు (డీఏవో ఆఫీసు నంద్యాల), ప్రధాన కార్యదర్శిగా ఎంసీ కాశన్న(కర్నూలు ఏడీఏ ఆఫీసు), ఉపాధ్యక్షులుగా మునీర్‌అహ్మద్(కర్నూలు భూసంర క్షణ), యహపనుల్లా (ఆలూరు), రాఘవేంద్రకుమార్ (నంద్యాల ఏడీఏ ఆఫీసు), ఆర్గనైజింగ్ సెక్రటరీగా బీసీ శంకర్‌నాయక్ (కర్నూలు ఏడీఏ ఆఫీసు), ఆర్గనై జింగ్ సెక్రటరీగా ఉమన్ సుభాషిణి(నందికొట్కూరు ఏడీఏ ఆఫీసు), జాయింట్ సెక్రటరీలుగా నారా యణ(కర్నూలు ఏడీఏ ఆఫీసు), ఇలియాస్ బాషా (కర్నూలు డీఏవో ఆఫీసు), సాయికుమార్ (నంద్యాల డీఏవో ఆఫీసు), జాయింట్ సెక్రటరీగా ఉమన్ అరు ణకుమారి(కర్నూలు డీఏవో ఆఫీసు), ఈసీ మెం బరుగా దేవరాజు (కర్నూలు డీఏవో ఆఫీసు), స్టేట్ కౌన్సిలర్‌గా ఎస్.ఆంజనేయులు(డీఏవో ఆఫీసు నం ద్యాల), కోశాధికారిగా నాగకిశోర్ (కర్నూలు డీఏవో ఆఫీసు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు. వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు రవిప్రకాశ్‌రావు మాట్లాడుతూ..ఉ ద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించ డానికి తగిన కృషి చేస్తానన్నారు.

బైక్‌ల చోరీ.. వెంటనే రికవరీ

ఆదోని అర్బన్: పట్టణంలో ఆదివారం పలు ప్రాం తాల్లో నాలుగు బైకులను చోరీ చేయగా.. పోలీస్ అధికారులు వాటి మూడింటిని రికవరీ చేశారు. ఆర్థగేరి తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద ఓ ఫంక్షన్‌హాల్ ముందు పార్కింగ్ చేసిన రెండు మోటార్‌సైకిళ్లు, అలాగే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద ఒక మోటా ర్‌సైకిల్, మరొక ప్రాంతంలో ఒక మోటార్ సైకిల్‌ను అపహరించారు. వెంటనే వాటి యజమానులు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీరామ్ పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి ఆ ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను సేకరించాలని ఆదేశించారు. మధ్యాహ్నం చోరీ జరిగిన నాలుగు బైకుల్లో మూడింటిని దుండగులు ఆలూరు రోడ్డులోని ఏపీజీబీ బ్యాంకు వద్ద వదిలేసి వెళ్లి పోయారు. ఆ బైకుల బ్యాటరీలు తదితర సామాన్లు దొంగిలించినట్లు గుర్తించారు. పట్టుబడిన బైకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమానుల రికార్డులను తనిఖీ చేసి సీఐ వారికి అప్పగించారు. మధ్యాహ్నం జరిగిన బైకు చోరీలను సాయంత్రం లోపు సీఐ శ్రీరామ్ రికవరీ చేయడంపై వాహనదా రులు కృతజ్ఞతలు తెలియజేశారు. నాలుగు బైక్‌లు చోరీ జరిగితే మూడు వాహనాలను వెంటనే రికవరీ జరిగింది. మరొక బైక్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా


జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను సత్కరించిన పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు: విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిం చారు. ఆకర్ష్ పేరుతో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యం లో నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు అధ్యక్షత వహించారు. ముందుగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీకారం చుట్టారు. అనంతరం పాఠశాలలో చదివిన 1992–93 బ్యాచ్ విద్యార్థులతో పాటు, ఆక ర్ష్ కమిటీతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పరస్పరం తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థులు పాఠశాల దశనుంచే నైపుణ్యాలను పెంపొందించుకోవాల న్నారు. తాను పాఠశాల పూర్వ విద్యార్థిగా కలెక్టర్ హోదాలో హాజరు కావడం చాలా గర్వంగా ఉంద న్నారు. కాల్వబుగ్గ గురుకుల పాఠశాల రాష్ట్రంలోనే అగ్రగామిగా నిల్వడం హర్షించతగ్గ విషయమ న్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానన్నారు. అనంతరం ఆకర్ష్ కమిటీ వారు పాఠశాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఒక్కో క్కరికి రూ.10 వేల చొప్పున ఇచ్చిన ఉపకార వేతన చెక్కులను అందజేశారు. రెండేళ్లలో ప్రతిభ కనపర చిన పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా అవార్డు లను పంపిణీ చేశారు. అనంతరం అలనాటి గురువు లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మా నించి, కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, ప్రధాన అటవీ సంరక్షణ అధికారి రామకృష్ణ, తహసీల్దార్ వెంకటరమణ, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఆక ర్ష్ నూతన కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ వేతనం రాదాయె!

- మే నెల 20 నుంచి ఆగిపోయిన చెల్లింపులు
- కూలీలకు తప్పని తిప్పలు



జిల్లాలోని పంచాయతీలు	478
జాబ్ కార్డులు	3.20 లక్షలు
రోజూ కల్పించాల్సిన పనిదినాలు	50,000
ఈ నెల 10న పనులకు వచ్చిన కూలీలు	16,739

కర్నూలు(అగ్రికల్చర్): అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామ ని, ఎవరూ వలస వెళ్లాల్సిన అవసరం లేదని జిల్లా నీటియాజ మాన్య సంస్థ అధికారులు గ్రామాల్లో చెబుతున్నారు. వీరి మాటల ప్రకారం రెక్కలు ముక్కలు చేసి, చెమటోడ్చి పనులు చేసినా కూలీలకు మాత్రం వేతనం అందడం లేదు. వానల్లేక వ్యవసాయ సీజన్ నిరాశజనకంగా ఉండటం, ఉపాధి వేతనం రాకపోవడంతో కొందరు బతుకు దెరువు కోసం వలస వెళ్తు న్నారు. గ్రామాణాభివృద్ధి శాఖ ద్వారా ‘ఉపాధి’ పనులు జరుగు తుండగా.. ఆ శాఖకు మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ కూలీల కష్టాలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రూ.70 కోట్ల బకాయిలు

జిల్లాలో ఉపాధి వేతనాల కోసం వెయ్యి, రెండు వేలు కాదు.. ఏకంగా లక్షకుపైగా కుటుంబాలు నిరీక్షిస్తున్నాయి. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, పెద్దకడబూరు, హాలహర్వి, ఆలూరు, ఆదోని, కోసిగి, దేవనకొండ, హొళగుంద, ఆస్పరి తదితర మండలాలకు ఉపాధి పనులే ఆధారం. మే నెల 20 వరకు ఉన్న ఉపాధి వేత నాలను గత ప్రభుత్వం చెల్లించింది. మే నెల 21 నుంచి ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు ఒక్క రూపాయి వేతనం కూడా చెల్లిం చిన దాఖలాలు లేవు. కర్నూలు జిల్లాలోనే రూ.70 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. ఇందులో పశ్చిమ ప్రాంతానికి సంబంధిం చిన బకాయిలే 75 శాతం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉపాధి పనులకు హాజరు నామమాత్రమే

ఉపాధి వేతనాలు భారీగా పెండింగ్‌లో ఉండిపోవడంతో పను లకు కూలీల హాజరు పడిపోయింది. ప్రస్తుతం రోజుకు 50 వేలపని దినాలు కల్పించాలనేది లక్ష్యం. కానీ రోజుకు 10 వేల పనిదినాలు కూడా కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఉపాధి కూలీలు పనులకు రాకపోవడంతో పండ్లతోటల సాగు కుంటు పడుతోంది. ప్రస్తుతం పండ్లతోటల అభివృద్ధికి సంబంధించి పిట్టింగ్ పనులు జరుగుతున్నాయి.

ఉపాధి కూలీల వేతనాలు మళ్లింపు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవి. వెనుకబడిన అన్ని జిల్లాల్లో వల సలు వెళ్లకుండా పనులు కల్పించాలనేది ఈ పథకం లక్ష్యం. 2024–25 సంవత్సరం ఏప్రిల్ నుంచి ఒక పని దినానికి రూ.300 ప్రకారం వేతనం చెల్లిస్తోంది. నిర్దిష్టమైన కొలతల మేరకు పనులు చేస్తే గరిష్ట వేతనం లభిస్తుంది. అయితే జిల్లాలో 15 శాతం మం దికి రోజుకు లభిస్తున్న వేతనం రూ.100 వరకే ఉంటోంది. జిల్లాలో సగటు వేతనం రూ.293 ఉన్నట్లు జిల్లా నీటియాజ మాన్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. ఉపాధి కూలీల వేత నాలకు కేంద్రం ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు విడు దల చేస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిధులను ఉపాధి కూలీ లకు చెల్లించడానికి మనసొప్పడం లేదు. ఇతర అవసరాలకు మళ్లించడంతో బకాయిలు కొండలాగా పేరుకపోయినట్లు తెలు స్తోంది. ప్రభుత్వం ఉపాధి నిధులను మళ్లించడంతోనే నేడు లక్ష కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉత్పన్నమైంది.

మే నుంచి వేతనాలు ఇవ్వలేదు



మాకు వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి పనులే ప్రధాన ఆదారం. మే నెల నుంచి నా భార్యతో కలసి ఉపాధి పనుల కు వెళ్లాను. ఇప్పటి వరకు చేసిన పనికి వేతనాలు అందలేదు. కూలీలకు వారం.. వారం వేతనాలు చెల్లిస్తే ఉపశమనం కలుగుతుంది. మే నెల నుంచి వేతనాలు బకాయిలు ఉన్నాయి. వాటి కోసం ఎ దురు చూస్తున్నాం. ఈ ప్రభుత్వం చొరవ తీసు కోవాల్సి ఉంది.

– రవికుమార్, చిర్తనగల్, కోసిగి మండలం

త్వరలోనే విడుదలవుతాయి

‘ఉపాధి’ వేతనాలు మే నెల 20 నుంచి పెండింగ్‌లో ఉన్న మాట వాస్తమే. త్వరలోనే ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు వేత నాలు జమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం మూడు, నాలుగు రోజుల్లో పెండింగ్ బకాయిలు విడుదల చేసే అవకాశం ఉంది. వేతనాలపై కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు